ఆపద్బాంధవ్యం

చలపతిరావు మామూలుగా ప్లేన్లో ప్రయాణంచేసే స్తోమతు వున్నవాడు కాదు. పదిమందిపిల్లలు ఉన్న కుటుంబానికి చెందినవాడు. పైగా కొద్దో గొప్పో సంపాదిస్తున్న అతని తండ్రి ఇటీవలే మరణించాడు. పిల్లల్లోకి పెద్దవాడు అతనే అవటంవల్ల కుటుంబాన్ని ఈదవలసిన భారం అతని మీదే పడింది.

అతను బి.ఏ. ప్యాసయి ఉద్యోగం చెయ్యకుండా వూరికినే ఉంటున్నాడు. ఈనాటి యువకుడు అవటంవల్ల ఉదరపోషణకంటే సంఘసేవ చెయ్యాలనే తాపత్రయం కలిగినవాడు. అతనితండ్రి బ్రతికిఉన్నంతకాలం అతను ఏం చేసినా చెయ్యకపోయినా జరిగిపోయింది. ఇప్పుడు కడుపుకోసం దేవులాట తప్పనిసరి అయింది. దానికి తగినట్లు ఢిల్లీలోని పబ్లిక్ సర్వీస్ కమీషన్, ఆ మధ్య పబ్లిసిటీ ఆఫీసర్ల పోస్టులకోసం ఎడ్వర్టయిజు చేసింది. అతను అప్లయి చేశాడు.

ఆ పోస్టులు రెండు. ఒకటి ఉత్తరాదివాళ్ళ కిచ్చినా ఒకపోస్టు దక్షిణాది వాళ్ళకి యివ్వగలరనే ధైర్యంతో అప్లికేషన్ పెట్టుకున్నాడు. అతడు అనుకున్నట్లే ఇన్టర్వ్యూ వచ్చింది. కాని ఢిల్లీ వెళ్ళి రావటానికి డబ్బేది?

డబ్బుకోసం చాలా ప్రయత్నించాడు గాని పుట్టలేదు. ఇక ఎల్లుండి ఇన్టర్వ్యూ అనగా ఒక స్నేహితుడు అతని దుర వస్థచూచి జాలిపడి డబ్బిచ్చాడు. అతనిది విజయవాడ దగ్గర ఒక గ్రామం. అప్పుడు రైల్లో ఢిల్లీకి బయలుదేరితే ఇన్టర్వ్యూ సమయానికి అందుకోలేడు. అందుకని ప్లేన్లో వెళ్ళాలని నిశ్చ యించుకున్నాడు. హైదరాబాద్ వరకూ రైల్లోవెళ్ళి అక్కడ దిగి ఏరోడ్రోముకి వెళ్ళాడు. ఇంకా ప్లేన్ రావటానికి ఒకగంట టైమ్ ఉంది.

జనం హడావుడిగా తిరుగుతున్నారు. కొంతమంది ప్రయాణీకులు సామాన్లు తూకం వేయించుకుంటున్నారు. కొంతమంది ఒకహాల్లో కాఫీలు, డ్రింకులూ త్రాగుతున్నారు. ఎదురుగావున్న హాలు విరామసమయంలో ప్రయాణీకులు విశ్రాంతి తీసుకునేది. అక్కడకు వెళ్ళి కూర్చున్నాడు చలపతి రావు.

అక్కడ స్త్రీలూ, పురుషులూ చాలమంది ఉన్నారు. ప్రజల్లో ఎవ్వరికి వారికి ప్లేన్లో ప్రయాణం చెయ్యాలనే కుతూ హలం ఉంటుంది. కాని తీరా ప్రయాణం దగ్గర పడేటప్పటికి ఏమవుతుందో అనేభీతి ఒకటి పట్టుకుంటుంది. అందుకని అక్కడ కూర్చున్న ఎవ్వరిముఖం మామూలుముఖంగా లేదు. ఏముఖం లోనూ నెత్తురుచుక్క లేకపోగా విపరీతమైన టెన్షన్ కొట్టవచ్చి నట్లు కనిపిస్తూ ఉంది.

వారిని చూస్తుంటే నవ్వువచ్చింది చలపతిరావుకి.

వారిలో ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగంచేసే ఆఫీసరుఒకరున్నారు. వారు చండశాసనులని ప్రతీతి. వారిపేరు చెబితే చాలు మిగిలిన ఆఫీసర్లంతా హడలిపోతుంటారు. అటువంటి వారుకూడా చేతిలో ముంతపట్టుకొని తన సమాధికి నడచి పోతున్నట్లు ముఖంపెట్టుకొని కూర్చోవటం చలపతిరావుకి చోద్యంగా కనుపించింది. వట్టప్పుడు ఎంత అహంకారం ఉన్నా ఆపద ఎదుర్కొన్నప్పుడు అందరి భయమూ ఒకటే అవటం చిత్రంగా తోచింది చలపతిరావుకి. తనచుట్టూ ఉన్న ముఖాలను పరికిస్తూ కూర్చున్నాడు.

అంతలో ఒక యువతి ప్రవేశించింది హాల్లోకి. చేతులో బ్యాగు పట్టుకొని, ఎత్తయిన మడమలు కలిగిన బూట్లుతొడుక్కొని బాబ్డ్ హెయిర్‌తో ఆమె చాలా ఫ్యాషన్‌బుల్‌గా వుంది. ఒక పాతికేళ్ళ వయస్సు వుండవచ్చు. ముఖం మంచి వర్చస్సుకలిగినముఖం. ఆ ముఖంకూడా కొద్దిసేపట్లో కళావిహీనమై పోతుంది కాబోలు – అని విచారపడ్డాడు చలపతిరావు.

ఆమె అటూ ఇటూ చూచింది. నిజంగా అవి లేడి చూపులే. అందరూ ఆమెవంకే చూస్తున్నారు. ఆమెచూపు చలపతిరావుమీద పడింది. చలపతిరావు కూర్చున్న కుషన్‌లోనే స్థలంవుంది. ఆమె నిస్సంకోచంగావచ్చి ఆ స్థలంలో కూర్చుంది. అంటే చలపతిరావు సరసనే కూర్చున్నదన్న మాట.

ఇంకేముంది? అంతకుముందు తనచుట్టూ కూర్చున్న వారి ముఖాలుచూచి తనలోతాను నవ్వుకుంటున్న చలపతి

రావు అస్థిమితస్థితిలో పడిపోయాడు. ఆమె దగ్గరకు రాగానే సువాసనలు గుప్పున ఎగబడినై. అతని తల తిరిగింది.

ప్రక్కనకూర్చున్న ఆమెను చూడాలనివుంది చలపతి రావుకి. కాని చూడలేక పోయాడు. నరాలు బిగువెక్కినై. అప్పుడు తనముఖంకూడా తనచుట్టూవున్న అందరి ముఖాలు మాదిరిగానే వుండివుంటుంది కాబోలు_ అనుకున్నాడు చలపతి రావు. నవ్వుకోలేక పోయాడు. కాని ఆమెను పలకరించాలని వుంది. ఎక్కడకు వెళుతుందో కనుక్కోవాలని వుంది.

బట్లరువచ్చి "డ్రింకులు కావాలా?" అని అడిగాడు.

ఆమె ఒక డ్రింకుకి ఆర్డరు ఇచ్చింది. వెళ్ళిపోతున్న బట్లరును పిలిచి "నాకుకూడా ఒకటి పట్టుకురా" అన్నాడు చలపతిరావు. ఆవిధంగా మాటకలిపి "తమరు ఎక్కడికి వెళ్తు న్నారు?" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. పైగా ముఖం అటుత్రిప్పుకు కూచుంది. ఏం చేసేటట్టు? మళ్ళీ అడిగితే ఏమంటుందో! చీదరించుకున్నా చీదరించుకోవచ్చు.

బట్లరు డ్రింకులు తెచ్చాడు. ఆమెతోపాటు అతనూ త్రాగాడు. డ్రింకులకు ఏరోడ్రోంలో మిగిలిన చోట్లకంటే ఎక్కువ తీసుకుంటారని విన్నాడు. ఎంత ఇవ్వాలి? 'ఎంత?' అని బట్లరుని అడిగితే, అసలే తనమీద సద్భావంలేని, ఆమె దృష్టిలో మరీ హీనపడిపోతానేమో అని భయపడ్డాడు. 'ఎవ్వరీ పల్లెటూరి గామార్? అనుకుంటుందేమో! ఆమె డబ్బు ఇచ్చేవరకూ వూరుకొని ఆమె ఇచ్చినంతా ఇచ్చిఒక్క

నిట్టూర్పు విడిచాడు. ప్లేన్ వచ్చింది. లౌడ్ స్పీకర్లు ఢిల్లీ వెళ్ళే ప్రయాణీకులు వెళ్ళి కూర్చోవచ్చని ఎనౌన్సు చేసినవి. అంతా బయలుదేరారు. ఆమె చకచకా నడిచి వెడుతోన్న తీరులో ఇతరులలో కనిపిస్తున్న సంకోచంగానీ, భయంగానీ ఏ కోశానా లేదు. ఆప్తమిత్రుని సందర్శనానికి వెళ్తున్నంత సంతోషంగా వెళ్ళింది.

చలపతిరావు నెమ్మదిగా వెళ్ళాడు. ప్లేనుఎక్కాడు. ఎయిర్ హోస్టెస్ అతని చేతిలోవున్న కాగితంముక్క పరిశీలించి, సీటుచూపింది. ఆసీటు ఆమె ప్రక్కసీటే. ఆ సీటు దాటివెళ్ళి తనకు నిర్దేశించిన సీట్లో కూర్చున్నాడు చలపతిరావు. ఆమె అతనిని చాలా నిరసనగా చూసింది. 'ఈ పల్లెటూరి గమార్ ఇక్కడికికూడా వచ్చాడే!' అని అనుకుంటూ ఉన్నదనుకున్నాడు. కోపంవచ్చి రాచుకుంటూ వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు.

ప్లేను కదిలింది. అతను ప్రక్క కిటికీలోనుంచి బయటకు చూస్తూకూర్చుంటే ఆమె తనలోకితాను చూచుకుంటూ కూర్చుంది. ఆమె సీటుకువున్న బెల్టు నడుముకు చుట్టుకుంది. అతనూ చుట్టుకున్నాడు. బయటకు చూస్తుంటే కండ్లు తిరుగుతున్నట్లనిపించింది.

చూపులు త్రిప్పుకొని కూర్చున్నాడు.

ఎయిర్ హోస్టెస్ వొక పళ్ళెంలో పిప్పరమెంట్లూ, చాకులెట్లూ పోసుకొని వచ్చి అందించింది. అతనుచూశాడు ఆమెవంకే. ఒక చాక్‌లెట్ తీసుకుంది. అదికూడా పళ్ళెంలో

వున్న రకాలన్నిటిలోకీ చిన్నది. అతనికి చాలా తీసుకోవాలనిపించింది. కాని వొక్కటే తీసుకున్నాడు. అదీ చాకొలెట్టే, అదీ అన్నిటిలోకీ చిన్నదే. అన్నీ ఆమెచేస్తున్నట్లు చేస్తున్నందుకు తనమీద తనకు చీదర కలిగింది.

విమానం చాలా ఎత్తున ఎగురుతూంది. ఎంతో క్రింద మేఘాలు దూదిపింజలవలె కదులుతున్నయ్. చలపతిరావుకి చిత్రమనిపించింది. భూమిమీదనుంచి చూస్తే మేఘాలు ఆకాశాన్ని అంటుకొని ప్రయాణం చేస్తున్నట్లువుంటై. అందుకనే రచయితలు 'ఆకాశాన్ని మేఘాలు అలుముకుంటున్నయి' అని వ్రాస్తారు. ఇప్పుడు తను ఆకాశానికీ, మేఘాలకు మధ్య వున్నాడు. అసలు ఆకాశమనేదే లేదు. ఆకాశం గగనం శూన్యం. ఇటువంటి తప్పులు మానవులు ఎన్ని చేస్తున్నారో! రచయితలు ఎన్ని వ్రాస్తున్నారో! అయినా ఈ తప్పులవల్ల ప్రపంచం బాధపడుతున్నట్లులేదు. దానిధోరణిలో అది నడిచిపోతూవుంది. 'ఈ ప్రపంచానికి తప్పులను ఇముడ్చుకొని, జీర్ణించుకొని బ్రతికేశక్తి వుంటుంది' అనుకున్నాడు చలపతిరావు.

"అదికొంచెం ఇటు త్రిప్పండి" అన్నదామె.

"ఏదీ?" అన్నాడు చలపతిరావు, ఆమె కంఠధ్వనికి ఉలికిపడి. ఆమె తనను పలకరిస్తుందని అతను అనుకోలేదు.

"అదే" అని గాలివచ్చే బుగ్గను చూపింది. ప్రతిసీటుకి ప్రక్కన గోడకు గాలివచ్చే రెండుబుగ్గలు వుండటం అతను అంతకుముందే చూశాడు. ప్రయాణీకులు వాటిని తమవైపుకు

త్రిప్పుకోవటంకూడా చూశాడు. కాని అతను వాటిజోలికి వెళ్ళదలచలేదు, ఏంచెయ్యబోయి ఏంచేస్తానో అనే భయంతో; ఏంచేస్తే ఏమవుతుందో అనేభయంతో. ఇప్పుడా బుగలను తనవైపుకు త్రిప్పమంటూఉండే. అసలే ఆమెమీద కోపంగా ఉండేమో, "మీరే త్రిప్పుకోండి" అన్నాడు చలపతిరావు.

ఆమె త్రిప్పుకు కూచుంది. అతను మళ్ళీ కిటికీలోనుంచి బయటకు చూచాడు. ఈసారి కాస్త ధైర్యం తెచ్చుకుని క్రిందకు చూచాడు. భూమిమ్మీదఉన్న పెద్దపెద్దవూళ్ళు బొమ్మరిళ్లలాగ అగుపించినై. భూమిమీద ఉంటే ఆవూళ్ళే గొప్పవిగా కన్పిస్తయి. పెద్దపెద్ద సౌధరాజాలుగా కనుపిస్తయి. ఆకాశం మీదనుండి చూస్తే అనంతంగా కనుపిస్తున్న భూమిమీద, ఈ వూళ్ళు సముద్రంలోని కాకిరెట్టలుగా, సున్నపు పిడచలుగా కనుపించి, హాస్యాస్పదంగా ఉన్నయ్. ఇక ఆ వూళ్ళల్లో నివసించే మనుష్యుల సంగతి వేరే చెప్పాలా?

మానవుడు ఎంత అల్పజీవో అప్పుడు తట్టింది చలపతిరావుకి. భూమిమీద నిలబడి తనకు కనపడే టంతవరకే నిజమనుకొని, అంతా తనమీదుగానే నడుస్తూ ఉందనుకొని, భ్రమపడి, దురహంకారము పెంచుకుంటాడు. గాని నిజంగా అతను ఒక్క నలుసు. ఆ సంగతి ఆకాశాన్నుంచి చూస్తేఇట్లే బోధపడుతుంది. మానవుడు పట్టినలుసు. నలుసుల్లో నలుసు.

ఎయిర్ హోస్టెస్ ముఖంలో ముఖంపెట్టి 'టీ యా? కాఫీయా?' అని అడిగింది ఆమెను.

ఆమె "కాఫీ" అన్నది.

అదేవిధంగా చలపతిరావుని అడిగింది.

చలపతిరావుకి అంతఎత్తున టీ కాఫీలు ఇస్తారని తెలియదు. అప్రయత్నంగా 'టీ' అన్నాడు.

మరుక్షణం తనప్రక్క కూర్చున్న ఆమె అడిగింది తను అడగనందుకు సంతోషించాడు.

ఎయిర్ హోస్టెస్ ఆమెకు కాఫీ, అతనికి టీ తెచ్చియిచ్చింది. ఆ క్షణం ఆమె అమృతం పంచిపెడుతున్న దేవతలాగా కనుపించిందతనికి. సన్నగా, చక్కగాఉన్నది. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ ఉంది. తొణుకు బెణుకు లేకుండా పలకరిస్తుంది. ముచ్చటగా మాట్లాడుతుంది. ఇంకేం కావాలి?

"థ్యాంక్సు", అన్నాడు ఆమె అందించిన టీకప్పు తీసుకొంటూ. టీతోపాటు ఆమె కొన్ని బిస్కట్లు కూడా ఇచ్చింది. ముందుసీటు వెనుక భాగానవున్న బల్ల పరిచింది. అది టేబుల్‌లాగు ఉపకరిస్తుందని గ్రహించాడు చలపతిరావు.

బిస్కట్లప్లేట్లూ, టీ కప్పూ దానిమీద పెట్టుకున్నాడు. చల్లగా వుండటంవల్లో, భయం కలిగిన టెన్షన్ వల్లోగాని టీ అమృతప్రాయంగా ఉంది చలపతిరావుకి.

అంతఎత్తున టీ త్రాగే అదృష్టం తనకు దొరికినందుకు విధిని మెచ్చుకున్నాడు.

ఆమె కాఫీ ముగించింది. ఎంత నెమ్మదిగా త్రాగినా తానే ముందు ముగించాడు. ఎయిర్ హోస్టెస్ కప్పులూ, ప్లేట్లూ పట్టుకుపోయింది. ముందుసీటు వెనుక భాగంలో ఉన్న బల్లలను మూసివేసింది.

ప్లేన్ క్రిందకు దిగుతూఉంది. ఆమె ఏదో ఆలోచిస్తూ ఉంది. కాస్త కలవరపడుతూ ఉందనిపించింది చలపతిరావుకి. ఎందుకు కలవరం ?

ప్లేన్ నాగపూర్ ఏరోడ్రోమ్‌లోకి దిగింది. ప్రయాణీకులందరూ దిగారు. అకస్మాత్తుగా ఆమె పలకరించింది.

"మీరు ఇక్కడ దిగుతున్నారా ?"

"లేదు."

"ఢిల్లీ వస్తున్నారా?"

"అవును."

ఇంకేదో అడుగుదామని కాసేపుతచ్చాడి ఆమెకూడా ప్లేన్‌దిగి బయటకు వెళ్ళింది. ప్లేన్‌మళ్ళీ బయలుద్దేరేవరకూ విశ్రాంతి తీసుకోటానికిగాను ప్రయాణీకులు దిగారని తెలుసుకొని తానూ దిగాడు చలపతిరావు. ఉన్నట్టుండి ఆమెలో ఇంతమార్పు ఎందుకువచ్చిందో అతనికి అర్థం కాలేదు.

ఏమీతోచక పుస్తకాలషాపుముందు చూస్తూ నిలబడ్డాడు. కాసేపటికి ఆమెకూడావచ్చింది. డ్రింకు తాగివచ్చిందని గ్రహించాడు చలపతిరావు. "నేనూ ఢిల్లీ వస్తున్నాను" అన్నది.

అతనికి ఏమిసమాధానం చెప్పాలో తోచక మెదలకుండా వూరుకున్నాడు.

"నాగపూర్ దాటేంతర్వాత ఇటీవలే ప్లేన్‌కి రెండు సార్లు యాక్సిడెంట్ అయింది" అన్నది.

"నేను పత్రికలో చదివాను."

"ఈసారి ఇటువంటి ప్రమాదం ఏమీ జరుగదుకదా!"

ఆమెలో వచ్చినమార్పుకి కారణం అతనికి లీలగా అర్థమయింది. "ఎలా చెప్పగలం?" అన్నాడు.

"ఏదన్నా జరిగితే?"

"పూర్వులు పోయినదారినే పోవలసివస్తుంది."

ఆమెముఖం వివర్ణమయింది. కండ్లు చెమ్మగిల్లినై. అతనికి జాలివేసింది. నేను నవ్వుతూఅన్నాను. "ఏ ప్రమాదమూ జరుగదులెండి" అన్నాడు తనకు ఆ విషయం బాగా తెలిసినట్లు.

"జరగదా"? అని ఆతురతగా అడిగింది. ప్రమాదాలు జరగటం, జరక్కపోవటం అతని చేతుల్లోనే వున్నట్లు.

"జరుగదు."

"థ్యాంక్సు" అన్నది. ఆమె వొక నవల కొనుక్కున్నది.

లౌడ్‌స్పీకరు ప్రయాణీకుల్ని ప్లేన్‌లోకివెళ్ళి కూర్చోమని చెప్పింది. అంతా వెళ్ళారు. ఎవరిసీట్లలో వారు యథాప్రకారం కూర్చున్నారు. ప్లేన్ ఢిల్లీ పయనమైంది రొప్పుకుంటూ, రొదచేసుకుంటూ.

ఆమె ప్రాణాలు బిగపట్టుకు కూర్చుంది.

ఆమె మనస్సులో చెలరేగుతున్న ఆలోచనలను మరచిపోవటానికిగాను, "మీరు ఏ పనిమీద వెళ్తున్నారు?" అని అడిగింది.

"ఉద్యోగంకోసం."

"ఏ ఉద్యోగం?"

అతను చెప్పాడు. ఆమె కొంచెంసేపు ఆలోచించి "నేను సహాయం చెయ్యగలను" అన్నది. ఢిల్లీలో వాళ్ళ ప్రభుత్వోద్యోగిని తాను ఎరుగుదుననీ, ఆయనతో రికమెండ్ చేయించగలననీ చెప్పింది.

"థ్యాంక్సు" అన్నాడు చలపతిరావు. అనుకోకుండా వచ్చిన ఈ సహాయానికి మనస్సులో చాలా సంతోషించాడు.

"ఢిల్లీలో మీరు ఎక్కడ దిగుతారు?" అని అడిగింది.

"ఇంకా ఏమీ అనుకోలేదు."

"మీకు అభ్యంతరం లేకపోతే నాతో రండి. నేను ఒకమిత్రుని ఇంట్లో బసచేస్తున్నాను. ఆయన సంతోషిస్తాడు"

"ఎందుకు మీకుశ్రమ? ఎడ్రస్ఇస్తే మిమ్మల్ని వచ్చి కలుస్తాను."

"శ్రమ ఏమీలేదు. అక్కడ హోటళ్ళలో గదులు దొరకడంకష్టం. పైగా ఆ తిండి మనకు పడదు. నా మిత్రుని తరఫున మిమ్మల్ని నేను ఆహ్వానిస్తున్నాను."

"థ్యాంకసండీ. అలాగే వస్తాను" అన్నాడు చలపతిరావు.

ప్లేను ఆకాశం ఎత్తునలేచి వెళ్తూఉంది.

ఆమె కాసేపు మాట్లాడకుండా కూర్చుంది. ఇటీవల జరిగిన ప్లేను యాక్సిడెంట్లను గురించి ఆమె ఆలోచిస్తూ ఉందని గ్రహించాడు చలపతిరావు. ఆ ఏక్సిడెంట్లు ఈ ప్రాంతాలే

జరిగినవని పత్రికల్లో చదివినట్లు గుర్తు. నవలతీసింది. చదువ బుద్ధి అయినట్లులేదు. కిటికీలోనుంచి బయటికి చూస్తూ_

"వాన కురుస్తున్నది" అన్నది బాధాకరంగా.

"లేదు" అన్నాను చలపతిరావు తానూ కిటికీలోంచి చూస్తూ.

"అటు క్రిందకి చూడండి_" వేలుపెట్టి చూపించింది.

"నిజమే, ముసురు కప్పుకొని భూమి కనిపించటంలేదు. అప్పుడు చలపతిరావుకి జ్ఞాపకం వచ్చింది. మేఘాలు వర్షిస్తాయనీ, మేఘాలకుపైగా తాము ప్రయాణం చేస్తున్నామని. మేఘాలకుపైగా ప్రయాణంచేస్తున్న తమకు దగ్గరగా వర్షం కురిసే అవకాశంలేదు. విమానానికీ భూమికీ మధ్యస్థంలో ఎక్కడనుంచో వర్షం ప్రారంభ మవుతుంది. ఈ దృశ్యం చిత్రంగా ఉంది చలపతిరావు మనస్సుకి. తాను వర్షానికి పైన వున్నాడు. వర్షంకురిసేది తనక్రింద.

"వర్షం కురిసేది క్రిందగదా! మనకేమి?" అన్నాడు.

"ప్లేన్ దిగటం కష్టం అవుతుంది. వర్షం ఎక్కువగా కురుస్తుంటే దిగవలసిన స్థలం పైలెట్‌కి కనబడదు" అన్నది విచారంగా.

"అప్పుడు ఏం చేస్తాడో?"

"ఇంకొక చోటుకి వెళ్తాడు."

"అక్కడా వర్షం కురుస్తుంటే?"

"మరింకొక చోటుకి."

"ఈ లోగా పెట్రోలు అయిపోవటమో, ఇంకేదన్నానో జరిగితే ?"

"రిస్కు తీసుకుని ప్లేన్ దింపుతాడు."

ఈ మాటకు చలపతిరావుకి కూడా కొంచెం భయం వేసింది. ఇంటి దగ్గర తనకు ఉద్యోగం వస్తుందనీ, తమ కష్టాలు గడుస్తవనీ పిల్లలను చుట్టూ కూర్చోపెట్టుకొని ఎదురు చూస్తున్నతల్లి జ్ఞాపకంవచ్చింది.

అతను చలించాడని గ్రహించింగామె. మానసిక సాన్నిహిత్యం ఎక్కువైంది. అతనివైపుకు తనకు తెలియకుండానే జరిగింది. వొక్క నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పు అతని కంఠానికి వేడిగా తగిలింది.

"ఏమి కానున్నదో!" అన్నది.

"మనకేం తెలుస్తుంది?" అన్నాడు చలపతిరావు. ఒక్కసారి ప్లేన్లోవున్న ప్రయాణీకుల నందరినీ కలయజూశాడు. అందరూ భయంతో బిర్రబిగుసుకొని కూర్చున్నట్లే కనుపించారు. ఎవరికివారు ప్రక్కవారితో మాట్లాడటానికే భీతావహంతో ఉన్నారు. అందరూ శ్మశానానికి పయనిస్తున్నముఖాలతో కూర్చునివున్నారు. భయంతో బిత్తరిచూపులను ప్రసరిస్తూ, బిగదీసుకొనిపోయి ఉన్న ఇన్ని ముఖాలను అతను ఇంతకు ముందు ఎన్నడూ చూచియుండలేదు. ఎవరి మరణగీతం, వారే ఆలకిస్తున్నట్లున్నారు.

"మీకు ఎవరున్నారు ఇంటి దగ్గర?" అని అడిగిందామె.

"అమ్మా" అన్నాడు చలపతిరావు. అతనికి తెలియకుండానే అతనికంఠం గాద్గదికమయింది. ఆ ధ్వనికి అతని నరాలు సడలినై.

"మీర్కో?" అని అడిగాడు, అదే కంఠస్వరంతో.

"మా ఆయన..." అన్నది. ఇంక మాట్లాడలేక పోయింది. కండ్లవెంట నీరు జలజల ప్రవహించింది.

"వూరుకోండి" అన్నాడు. అప్రయత్నంగా ఆమె చెయ్యిమీద చెయ్యివేశాడు వోదార్పుగా. అతని శరీరం జలదరించింది. నెమ్మదిగా నిమిరాడు.

ఆమెకు అదేమీ విపరీతంగా కనుపించలేదు. నెమ్మదిగా పమిటచెంగుతో కన్నీరు అద్దుకుంది.

"ఏమవుతుందో?" అన్నది

"ఏమీకాదు" అన్నాడు చలపతిరావు ఆమెవేళ్ళు సవరిస్తూ.

అంతలో ప్రయాణంచేస్తున్న ప్లేన్‌నుంచి వింతధ్వని ఒకటి బయలుదేరింది. సన్నగా బయలుదేరి, క్రమ క్రమేణా పెద్దదయింది. అంతా నిలువుగుడ్లువేసి చూస్తూ కూర్చున్నారు. సూట్‌లోవున్న పెద్దఉద్యోగి కంగారుగా లేవబోయి ప్లేన్‌వూపుకి మళ్ళీ చతికిలబడ్డాడు. ఎయిర్‌హోస్టెస్ చిరునవ్వు నవ్వుకుంటూ అతని దగ్గరకు వెళ్ళింది.

"ఏమిటది?" అని అడిగాడు, ఎయిర్‌హోస్టెస్‌ను.

"మరేంలేదు. భయపడకండి" అన్నదామె.

చలపతిరావు విన్నాడు. ప్రక్కనున్న ఆమె విన్నది.

"ఎక్కడ బెంబేలు పడిపోతామేమో నని వాళ్ళు అలాగే అంటారు" అన్నది చలపతిరావుతో.

"అయితే మనం ప్రమాదానికి లోనైనట్లేనా?"

"ఇంకా అడుగుతున్నారా?" అని వెక్కి వెక్కి ఏడువ నారంభించింది.

"పూరుకోరూ, నా మాట వినరూ?" అని సముదా యించాడు చలపతిరావు, ఆమె చేతిని పూర్తిగా తనచేతిలోకి తీసుకుంటూ. మరణించవలసివస్తే తమతోపాటు సూట్ వేసుకొని కంగారు పడుతున్న ఆ ప్రభుత్వోద్యోగికూడా వున్నాడనే సంతోషం అతనిమనస్సులో తటుక్కున మెరిసింది. పైగా అతను వొంటరిచావు చస్తాడు. తన చేతిలోవున్న ఆమెచెయ్యి కదిలింది.

"మా ఆయనసంగతి మీకు చెప్పలేదు" అన్నదామె.

"అవును" అన్నాడతను విచారంగా.

"నన్ను చాలా హింసించాడు. నామనస్సును ముక్కలు క్రింద తరిగాడు. ఆయన నల్లగావుంటాడు. అందుకని ఆయ నంటే నాకుఇష్టంలేదని ఆయన అనుమానం... చివరికి విసిగి ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను ... ఆ సమయంలో తటస్థపడ్డాడు... దేవుడు ప్రత్యక్షం అయినట్లు అయినారు..."

"ఎవ్వరు?" అని అడిగాడు చలపతిరావు విచారం గానే.

"కృష్ణానందం... ఇప్పుడు నేనువెళ్ళేది ఆయన దగ్గ రకే" అని ఏడవదొడగింది.

ఆమె అంత భయపడి పోవటానికి కారణం చలపతి రావుకి అప్పుడు పూర్తిగా అర్థంఅయింది. చెయ్యి నిము రుతూ, వ్రేళ్లు సవరిస్తూ ఎంతో ఇదిగా సముదాయించాడు. ఆపత్కాలంలో అందరినోటినుంచి వెలువడే మాటలే అతని నోటినుంచి వచ్చినై.

"భగవంతుడున్నాడు. మనం సురక్షితంగా జేరుతాం."

ఆ మాట అన్నాడో లేదో విమానం; ఒక్కకుదుపు కుదిపింది. ఏ క్షణం పల్టీ కొడుతుందో అన్నంత ఒడుదుడుకు లుగా ప్రయాణం మొదలుపెట్టింది. విమానం అంతా గంద్ర గోళంఅయింది. సూటులో వున్న పెద్ద ప్రభుత్వోద్యోగి, "అమ్మో!" అని బిగ్గరగా ఆక్రోశించి లేచి నిలబడ్డాడు.

ఆయనకేకతో విమానం దద్దరిల్లిపోయింది. ఆమె చల పతిరావు కంఠం కావిలించుకొని పెద్దపెట్టున ఏడవ నారం భించింది. "నా జీవితం ఇట్లా అంతం కావలసిందేనా?... కృష్ణానందంగారిని చూచే ప్రాప్తం కూడాలేదా ... ఈ జన్మకి?" అని అడుగుతూనే వుంది. చలపతిరావుకి ఏమి చెప్పాలో తెలియక తల నిమురుతూ కూర్చున్నాడు. చెక్కిళ్లు కూడా నిమిరాడు. "నామాటనమ్మండి. మనకు ఏ యిబ్బందీ రాదు" అంటూనే వున్నాడు.

అంతలో విమానం తేరుకుంది. ఎయిర్ హోస్టెస్ ఎక్కడివారిని అక్కడ కూర్చోబెట్టే ప్రయత్నంలో వుంది. "ప్రమాదం ఏమీలేదు. ఎవ్వరూ కించిత్తుకూడా భయపడ వలసిన అవుసరంలేదు" అని లౌడుస్పీకరు చెప్పింది.

"ప్రమాదం లేదా?" అని, వొణికిపోతూ బిగ్గరగా కేక వేసి అడిగాడు సూటులోవున్న ఆ పెద్ద ప్రభుత్వోద్యోగి.

"లేదు" అని నమ్మకంగా చెప్పింది ఎయిర్‌హోస్టెస్.

అంతా ఒక్క నిట్టూర్పు విడిచారు. ప్రభుత్వోద్యోగి సీట్లోకి నెమ్మదిగా జారుకున్నాడు. తోప అయ్యాడు.

కాని ఆమె మాత్రం చలపతిరావు భుజంమీదనుంచి తల తియ్యలేదు. కన్నీటితో అతని భుజం తడుపుతూనేవుంది. "చూడండి, ప్రమాదం లేదుట. ప్లేన్ మామూలుగానే ప్రయాణం చేస్తూ ఉంది" అని అతను అంటూనే వున్నాడు. ఆమె మాత్రం కన్నువిప్పలేదు. దూరాన్నించి ఈపరిస్థితిచూచి వేడి కాఫీపట్టుకొని వచ్చింది ఎయిర్‌హోస్టెస్. చలపతిరావు భుజంమీద తలఆన్చి కంఠాన్ని కావిలించుకొనివున్న ఆమెను లేపి, బలవంతంగా కాఫీ తాగించింది. తలపైకెత్తి కాస్తకాస్త చొప్పున నోట్లో పోసింది.

ఆమె తెప్పరిల్లి, "నేను ఎక్కడున్నాను?" అని అడిగింది.

"ఢిల్లీకి దగ్గర్లో వున్నాం" అని చెప్పింది ఎయిర్‌హోస్టెస్.

"ఏక్సిడెంటు కాలేదా?"

"ఏక్సిడెంటు అవటం ఎందుకు?"

"నిజమేనా?"

"నిజమే!"

ఆమెఒక్కసారి ప్రయాణీకులనందరినీ తేరిపారచూసింది. ప్రభుత్వోద్యోగి, తన ప్రక్కనవున్న అతనితోనూ, వెనుకన

వున్న అతనితోనూ, చిరునవ్వునవ్వుతూ ఏదో గంభీరంగా మాట్లాడుతున్నాడు. ఏ పరిస్థితుల్లోనైనా మనిషి నిబ్బరం కోల్పోకూడదని ఆ మాటలసారాంశం.

"మరి వర్షమో?" అన్నదామె.

"తగ్గిపోయింది" అని చెప్పింది ఎయిర్‌హోస్టెస్.

"ఇందాక ఎందు కంత గందరగోళం జరిగింది?"

"ప్లేన్ కాస్త ట్రబుల్ ఇచ్చినమాట యదార్థమే"

"మళ్ళీ ఇవ్వదని నమ్మకం ఏమిటి?"

"ఇక ఇవ్వదు. అదీకాకుండా ఢిల్లీకి దగ్గిరకువచ్చాం. అదిగో ప్లేన్ దిగుతోంది. కాస్త బెల్టుకట్టుకుంటారా?" అని చిరునవ్వు నవ్వుతూనే బెల్టుకట్టింది. చలపతిరావు తనకుతానే బెల్టుకట్టుకున్నాడు. ఎయిర్‌హోస్టెస్ చిరునవ్వు నవ్వుకుంటూ మరొకసీటు దగ్గరకు వెళ్ళింది.

ప్రమాదం తప్పిందని తెలియగానే ఆమె క్షణంలో మారిపోయింది. ముఖంలోకి రక్తం ప్రవహించి మళ్ళీ కలకల లాడుతూవుంది. చెక్కిళ్ళమీద ఇంకా కన్నీటిధారలఛాయలు కనుపిస్తున్నా నునుపుకు తిరిగినై. కండ్లు తేజస్సుతో తళతళ లాడుతున్నయి. పెదిమలు ఎరుపెక్కి పగడాలవలె మెరుస్తున్నయి. చిరునవ్వు చిందిస్తూవుంది.

ఆమెను పలకరించడానికి చలపతిరావుకి సంకోచం ఉదయించింది. క్షణంలో తనకామె దూరం అయినట్లనిపించింది.

"భయంతీరిందా?" అని అడిగాడు.

ఆమె అతనిని క్రీగంటచూచి, సిగ్గుపడింది. అంతలో చిరాకుపడి పమిటెసర్దుకొని కూర్చుంది.

కాస్త దూరంగా చిత్రంషూటింగుకి తయారు చేసుకున్న మోడల్ సెట్ వలె కనుపిస్తూవుంది ఢిల్లీ. ప్లేన్ ...దిగుతూ వుంది. పొలంనుంచి ఇంటికి తిరిగివచ్చే ఎడ్లజంటవలె ఆవురుమంటూ దిగుతూవుంది. ఆహారాన్ని తన్నుకుపోవడానికి దిగే గ్రద్దనువలె దిగుతూవుందనికూడా చెప్పుకోవచ్చు.

చల్లనిగాలి వీస్తూవుంది. త్వరలోనే ఢిల్లీలో ఆగబోతున్నాంగదాఅని ఆమెను పలకరించడానికి ప్రయత్నించాడు చలపతిరావు. ఇంతకీ ఆమెపేరే తనకు తెలియదు. పేరు అయినా తెలుసుకుందామని అనుకున్నాడు. తెలుసుకుందాం అనుకోవటమేకాదు. జరిగిందాన్నిబట్టి ఆ బాధ్యత తనమీద ఉందనుకున్నాడు.

కాని అతనికి ఆ అవకాశం దొరకలేదు. ఆమె ఏదో ఆలోచించుకుంటూ తనలోతాను చిరునవ్వులను మలుపుమంటూవుంది. "చూడండీ" అన్నాడు. కాని చూచేదిఏమీ లేదు. ఆమె పలుకలేదు. పలకరించలేదు. నెమ్మదిగా నవల తెరిచి చదువుకుంటూవుంది.

ప్లేన్ ఆగింది. ప్రయాణీకులు సురక్షితంగా జేరాం అనే సంతోషంతో గబగబా దిగారు. అందరికంటె ముందు ఆమె దిగింది. హడావుడిలో నవల మరచిపోయింది. ఆ నవల తీసుకొంటూ, ఉన్నటుండి ఆమె ఎందుకంత ముడుచుకుపోయిందా అని ఆలోచించుకొంటూ, చలపతిరావు దిగాడు.

ఆమెకు ఎదురుగా ఒక యువకుడు మందహాసం చేసుకొంటూ వచ్చాడు. ఆ యువకుణ్ణి చూసేటప్పటికి ఆమె ఉప్పొంగి పోయింది. పరిసరప్రాంతాలను మరచిపోయి

అతనికి తనచెయ్యి అందించింది. ఏదో మాట్లాడుతూ నుంచుంది. అతను ఇంతింతకండ్లు చేసుకొని వింటున్నాడు. ప్లేన్ ప్రమాదాన్ని గురించి చెపుతూవుందని ఊహించాడు చలపతిరావు. గతించిన విషయంగనుక నవ్వుతూ వొక జాన పదకథను అభివర్ణిస్తున్నట్లు చెపుతూ వుంది.

ఇప్పుడు తనేం చెయ్యాలనేది పెద్దసమస్య అయింది చలపతిరావుకి. ఆమె తనతోపాటు తన మిత్రునిఇంట్లో వచ్చి వుండమన్నది.

కనీసం చెప్పయినా వెళ్దామని వాళ్ళదగ్గరకు నడిచి నిలబడ్డాడు. పుస్తకం ఇవ్వవలసిన బాధ్యత వొకటి వుండనే ఉన్నదిగదా!

"నాతో ఏమన్నా పని వున్నదా?" అని అడిగాడు ఆ యువకుడు.

"లేదు" అని తలవూపి ఆమె వంకకుచూశాడు. ఆమె ఏదో ఒకటి తేల్చి చెపుతుందని ఆశపడ్డాడు. ఆమె వొక పర్యాయం అతనిని నఖశిఖ పర్యంతం చూసింది. అంతే, ఎరగ నట్లు మొఖం త్రిప్పివేసుకొంది. దగ్గరకువెళ్ళి, "పుస్త కము మరిచి పోయారు" అని అందించాడు.

"థ్యాంక్సు" అన్నది మరచిన సామాను తెచ్చిపెట్టిన ఏ పరాయి వాడితోనో అన్నట్లు.

"కారు బయటవుంది. ఇక వెళదామా?" ఆమెను ఆ యువకుడు అడిగాడు.

"అలాగే" అన్నదామె. అంతే. చలపతిరావువంక తిరిగన్నాచూడలేదు. వాళ్ళు ఇద్దరూ చెట్టా పట్టాలు పట్టుకొని

బయటకు నడిచి వెళ్ళారు. చలపతి రావు నిర్విణ్ణుడై చూస్తూ నిలబడ్డాడు. ఆమెచెప్పిన కృష్ణానందం అతనేనని గ్రహించ డానికి అతనికి ఎక్కువసేపు పట్టలేదు. అయితే మాత్రం? తననింత నిర్లక్ష్యం చేయవలసిన అవసరమేముంది? అంత గాఢమైన గతాన్ని అంత తేలికగా ఎట్లా తుడిచి వెయ్యగలి గింది? తన పరిచయాన్ని అంగీకరించడానికి ఆమె సిగ్గూ, బాధా పడుతున్నట్టు కనిపించింది.

ఎందుకు? తన తప్పేమివుంది.

కాళ్ళు ఈడ్చుకొంటూ బయటకు బయలుదేరాడు చలపతిరావు.